ఆంగ్లం.. అనర్గళంగా..


పాల్గొన్న జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు

- ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ శిక్షణ
- బోధనాభ్యసనప్రక్రియకు ఊతమిచ్చేలా..
- ఆన్‌లైన్ వేదికగా ప్రత్యేక తరగతులు..

నిర్మల్‌ఖిల్లా: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి. తాను నేర్చుకుంటూ.. విద్యార్థులకు నేర్పిస్తాడు. కాలానికి అనుగుణంగా తనను తాను మలుచుకుంటేనే ఉపాధ్యాయులు వృత్తిలో రాణిస్తారు. విద్యార్థులకు ఉత్తమంగా బోధించగలుగుతాడు. అందుకే ప్రభుత్వం కూడా నూతన విధానాలపై ఉపాధ్యాయులకు నిపుణులతో ఎప్పటికప్పుడు శిక్షణ ఇప్పిస్తుంది. గతేడాది నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలుగా మారాయి. దీంతో ఉపాధ్యాయులు ఇంగ్లిష్ మీడియంలోనే పాఠాలు బోధిస్తున్నారు. అయితే ఆంగ్లంలో బోధించే పాఠాలను సులభంగా, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు భావవ్యక్తీకరణ కూడా ఆంగ్ల మాధ్యమంలోనే ఉండాలి. ఈ నేపథ్యంలో నైపుణ్యాలను సాధించడం కోసం జిల్లా విద్యాశాఖ ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ భాషపై శిక్షణ ఇస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిపుణులను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్ వేదికగా ప్రతీరోజు సాయంత్రం గంటపాటు ఇంగ్లిష్ భాషలో శిక్షణ ఇస్తున్నారు. తగిన నోట్స్, ప్రాక్టీస్ వర్క్ షీట్లు, అభ్యసన కృత్యాలు ఇస్తూ ఆంగ్లభాషలో తర్ఫీదు ఇస్తున్నారు. భయం, బెరుకు లేకుండా ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా తీర్చిదిద్దుతున్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడేలా..

ప్రభుత్వ పాఠశాలల బలోపేతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం విద్యార్థులు తమ మాతృభాషలాగే ఇంగ్లిష్ కూడా సరళంగా, సులభంగా, అనర్గలంగా మాట్లాడాని భావిస్తోంది. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే 45 రోజుల ఆన్‌లైన్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ విల్ టు కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ డైరెక్టర్ ఇంగ్లిష్ ట్రైనర్ రామేశ్వర్‌గౌడ్ ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా గత ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఎన్.రెడ్డి కాలనీలోని క్లబ్ హౌస్ సమావేశ హాల్‌లో ఉపాధ్యాయులకు ఒకరోజు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు.

భాషా నైపుణ్యాలు పెంచేందుకే..



ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఎస్‌సీఈఆర్టీ ప్రత్యేక అనుమతితో స్వచ్ఛందంగా ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం. జిల్లా ఉపాధ్యాయులకు కూడా 40 రోజుల ఆన్‌లైన్ వేదికగా రోజువారీ శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 55 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్లభాషలో శిక్షణ అందించాం.

– రామేశ్వర్‌గౌడ్, ఇంగ్లిష్ ట్రైనర్, హైదరాబాద్

సద్వినియోగం చేసుకోవాలి...



జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజుల ఆన్‌లైన్ ఆంగ్ల భాష శిక్షణ కొనసాగుతోంది. ఒకరోజు ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం కూడా పూర్తయింది. ప్రతీ ఉపాధ్యాయుడు ఆంగ్ల భాష ధారాళంగా మాట్లాడేలా ఎదగడానికి శిక్షణ తోడ్పడుతుంది. ప్రస్తుతం కొనసాగుతున్న శిక్షణను జిల్లాలోని ప్రతీ ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: 'వరల్డ్ విజన్ ఇండియా' ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు రాఘవేంద్ర పబ్లికేషన్స్ పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. లక్ష్మణచాంద మండలంలోని 364 మంది పదో తరగతి విద్యార్థులకు ఏరియా డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా పుస్తకాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, ఎన్జీవో ప్రోగ్రాం అధికారి బ్రహ్మన్న, ఎన్జీవో ప్రతినిధులు అంబేద్కర్, హంగమన్న, ఎస్ఆర్ పబ్లికేషన్స్ ప్రతినిధి సాయినాథ్, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. పాత బస్టాండ్ ప్రాంతంలో నూతనంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించే అంశాన్ని చర్చించారు. డంపింగ్‌యార్డులో పొడిచెత్తను విక్రయించగా వచ్చిన డబ్బులను అభివృద్ధి పనుల కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని పార్కుతో పాటు ఇతర సమస్యలు చర్చకు వచ్చాయి. వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు సంకీర్తన, విజయలక్ష్మి, స్రవంతి, లత, కిషోర్, ఖలీల్, శ్రీనివాస్, కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

సరుకులు సకాలంలో అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ లింగంమూర్తి

తానూరు: ప్రతీ నెల గ్రామాల్లో ప్రజాపంపిణీ సరుకులు సకాలంలో అందించాలని తహసీల్దార్ లింగంమూర్తి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల రేషన్ డీలర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతీనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ డీలర్లు అందుబాటులో ఉండి సరుకులు అందించాలన్నారు. రేషన్ డీలర్ షాపులేని గ్రామాలకు పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా సరుకులు తరలించి సరఫరా చేసేలా చూడాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల డీలర్లు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సమత సుదర్శన్

తానూరు: మండలంలోని మసల్గా గ్రామానికి చెందిన గాయక్‌వాడ్ మమత బేస్‌బాల్ క్రీడా విభాగంలో జాతీయ స్థాయికి ఎంపిక కాగా సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ శనివారం తానూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో క్రీడాకారిణికి రూ. 24వేల చెక్కు అందజేశారు. సమతఫౌండేషన్ సీఈవో అనిల్, పీఆర్వో క్రాంతి, కార్యదర్శి సిద్ధు, మాజీ సర్పంచ్ మాదవ్‌రావు పటేల్, పుడలిక్, సాయినాథ్, దేవిదాస్, బంటిగౌడ్, మాణిక్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానంలో జిల్లా ఫోరం నేతలు

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో శనివారం నిర్వహించిన ఉద్యమకారులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో జిల్లా నుంచి ఫోరం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టే శేఖర్, జిల్లా అధ్యక్షుడు ముష్కం రామకృష్ణ గౌడ్, రచయిత జాదవ్ పుండలిక్ రావు, నాగారావు, రామచంద్రరావు, శంకర్, పుప్పాల పీరాజి, మహేందర్ గౌడ్, దత్తాత్రి, రావుల శంకర్, నవీన్, సుదర్శన్ హాజరు కాగా వారిని ఆత్మీయంగా సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రామారావు పటేల్

భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో నియోజకవర్గ పరిధిలో ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు 45 మంది, పదోన్నతి పొందిన 150 మంది ఉపాధ్యాయులు, నూతన ఎంఈవోలను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మండలానికి ఒక బెస్ట్ స్కూల్ ఎంపిక చేసి అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు, ఎమ్మెల్యే తనయుడు సతీశ్ పవార్ మాట్లాడుతూ.. అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

మొహాళ గ్రామాన్ని జీపీగా మార్చాలని వినతి

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామ అనుబంధ గ్రామం మొహాళ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయలని శనివారం భైంసా పట్టణంలోని తన నివాసంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. వీడీసీ సభ్యులు గంగాధర్, రమేశ్, సత్యాగౌడ్, గంగాధర్, అన్వేశ్, ఆర్.రమేశ్, విజయ్, సాయినాథ్ ఉన్నారు.

తెలుగు భాషపై సంపూర్ణ అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో సుభాష్

భైంసారూరల్: తెలుగు భాషపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సుభాష్ అన్నారు. శనివారం మండలంలోని దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు బోధిస్తున్న ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ప్రతీ తరగతికి ఒక గ్రంథాలయం పీరియడ్ ఉండాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఆర్పీలు రాజేశ్వర్, హన్మండ్లు, ఆయా పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు, రూం టూ రీడ్ ప్రతినిధులు ఉన్నారు.

లక్ష్మణచాంద: రీడ్ ఆధ్వర్యంలో ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ అంశంపై 1, 2వ తరగతులకు తెలుగు బోధించే ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఎంఈవో అశోక్‌వర్మ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలోని ఒకటి, రెండో తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడంలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. రూమ్ టు రీడ్ మండల కో ఆర్డినేటర్ గోవర్ధన్ నాయుడు, తెలుగు బోధన రిసోర్స్ పర్సన్ సాయన్న, రాజేశ్వర్, సీఆర్పీలు మహేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

లోకేశ్వరం: నివాళులర్పిస్తున్న నాయకులు


ముధోల్‌లో నివాళులర్పిస్తున్న యువకులు


జిల్లాలోని పలు మండలాల్లో భగత్‌సింగ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం విప్లవమే శరణ్యమని నమ్మి తన జీవితాన్ని భారతమాతకు అంకితం చేశారని గుర్తు చేశారు. వీరుడి త్యాగాలను ప్రతిఒక్కరు గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు.


భైంసారూరల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


నిర్మల్‌చైన్‌గేట్: చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


కుంటాల: జయంతి వేడుకలలో పాల్గొన్న విద్యార్థులు

తుది ఓటరు జాబితా ప్రదర్శన


సారంగాపూర్: ఓటరు జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తున్న అధికారులు

సారంగపూర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావులు ఎంపీడీవో కార్యాలయం నోటీసు బోర్డుపై తుది ఓటరు జాబితా ప్రదర్శించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాల్లో సవరణల అనంతరం తుది జాబితా సిద్ధం చేశామన్నారు. ఎంపీవో అజీజ్ ఖాన్, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల ఓటరు జాబితా ముసాయిదా ప్రకటించిన అధికారులు శనివారం తుది జాబితా వెల్లడించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, సూపరింటెండెంట్ నర్సింహస్వామితో పాటు మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని గొడిసెరా, పంచగుడి, ధర్మోర, వట్టోలి తదితర గ్రామాల్లో ఓటరు తుది జాబితాను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం ప్రదర్శించారని ఎంపీడీవో వెంకటరమేశ్ తెలిపారు. ఎంపీఈవో సోలమాన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని 13 గ్రామ పంచాయతీల తుది ఓటరు జాబితాను శనివారం విడుదల చేసినట్లు ఎంపీడీవో పుష్పలత తెలిపారు. మండలంలో మహిళా ఓటర్లు 9298, పురుష ఓటర్లు 10413, మొత్తం ఓటర్లు 19712 ఉన్నారన్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో శనివారం ఓటరు తుది జాబితాను అధికారులు ప్రదర్శించారు. గ్రామాలలో ప్రజలకు ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, పంచాయతీ కార్యదర్శి అరుణ, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, మగ్గిడి దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై శిక్షణ


ఏఈవోలతో వ్యవసాయ శాఖ అధికారులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతువేదికలో గత రెండు రోజులుగా వాటర్ మేనేజ్‌మెంట్, వాటర్ కన్జర్వేషన్, వాటర్ హార్వెస్టింగ్, మైక్రో ఇరిగేషన్‌లపై నిర్మల్ జిల్లా ఏఈవోలకు 2 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం ఏఈవోలకు సర్టిఫికెట్లు అందజేశారు. పంటలకు తక్కువ మోతాదులో నీటిని వినియోగించే పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. వాలంతరి వ్యవసాయ సంచాలకులు సునీత, వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, డీఏఓ అంజిప్రసాద్, ఏడీఏ భాస్కర్, ఏవో రామచందర్ నాయక్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయాలపాలైన లక్ష్మణ్

లక్ష్మణచాంద: మండలంలోని కనకపూర్ గ్రామ ప్రధాన కూడలి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. పెంబి మండలంలోని రాజురా గ్రామానికి చెందిన కమటం లక్ష్మణ్ తన ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా కనకాపూర్ జాతీయ రహదారిపై డివైడర్‌కు బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆయన కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సామూహిక తనిఖీలు సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో

ముధోల్: 14వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 –24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ. 3కోట్ల వ్యయ ఉపాధిహామీ పనులకు గాను సామాజిక తనిఖీ బృందం పనుల వివరాలు సేకరించనున్నారు. కార్యక్రమంలో ఏపీవో శిరీష, ఎస్ఆర్‌పీ భగవంత్‌రావు, డీఆర్‌పీలు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి


పెంచికల్‌పాడ్ గ్రామంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీపీవో, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్, వెంకూర్ గ్రామాలలో శనివారం పర్యటించి స్వచ్ఛతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శులు సారిక, ఉత్తం, అరుణ, సీసీ పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు..

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని అందాకూర్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. 15 రోజులకోసారి మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ఎంపీవో ఎంఏ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి

జీవో 51 రద్దు చేయాలని వినతి

ఖానాపూర్: జీవో నంబర్ 51 రద్దు చేయడంతో పాటు కనీస వేతన చట్టం వర్తించేలా చూడాలని కారోబార్‌లు కోరారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్, జన్నారం, మామడ మండలాలకు చెందిన కారోబార్‌లు ఎమ్మెల్యే వెడ్మబొజ్జును కలిసి వినతిపత్రం అందజేశారు. కారోబర్ శేఖర్‌గౌడ్, ప్రసన్న, ఆకుల వెంకటేశ్, మల్లేశ్, ముజ్జు, బాబన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

దిలావర్‌పూర్: ప్రతీ విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో కస్తూరి శంకర్ అన్నారు. మండలంలోని సిర్గాపూర్ గ్రామఫ్లేర్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీల సెలెక్షన్స్ నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 బాలబాలికల జట్ల ఎంపిక చేపట్టారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఫ్లేర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమణారావు, పీఈటీ సుధాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హాస్టళ్ల పరిశీలన

కుభీర్: మండలంలోని ఎస్సీ హాస్టల్, గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలను శనివారం మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. హాస్టల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

పర్యవేక్షణ లోపంతో ప్రాణాలకు భద్రత కరువు

ఖానాపూర్: నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ లోపంతో ప్రజల ప్రాణాలకు భద్రత కరువైందని సీపీఐఎంఎల్, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ తీరుపై తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. లింగన్న, రాజన్న తదితరులు ఉన్నారు.

పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలోని బ్రిలియంట్ పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు బతుకమ్మలు పేర్చి కోలాటాలు ఆడుతూ వేడుకలు జరుపుకున్నారు. కరస్పాండెంట్ నాగమొగిలి, హెచ్ఎం ఉజ్వలజ్యోతి, తదితరులు ఉన్నారు.

నూతన ఎంఈవోకు సన్మానం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం నూతన ఇన్‌చార్జి ఎంఈవో కిషన్ రావు, గత ఇన్‌చార్జి ఎంఈవో శంకర్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఉపాధ్యాయులు ఎంఈవోలకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర దేవరకోట దేవస్థానంలో శనివారం విశ్వహిందూ పరిషత్, గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, హనుమాన్ చాలీసా, దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ముప్పిడి రవి, మూర్తి ప్రభాకర్, రాజేందర్, జనార్ధన్, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం'

కడెం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ బూత్ అధ్యక్షుడు కొప్పుల భూమన్న, కన్వీనర్ యాతం రాజు, మిల్కురి సతీశ్, నరేందుల ప్రసాద్, నరేశ్, సాయి తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. శనివారం మండలంలోని బోరిగాం గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ కమల్ నయన్ పాల్గొని పలువురికి సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. ఇందులో మండల కన్వీనర్ అడ్వాల రమేశ్, మండల అధ్యక్షుడు పాలాస గోవర్ధన్, చంద్ర మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎఫ్ఐ నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి'

నిర్మల్‌రూరల్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్, దిగంబర్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి మహాగర్జన ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర నాయకులను హైదరాబాద్ ఇందిరా పార్కు దగ్గర అక్రమంగా అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు దీపక్, రాజు, చంద్రకాంత్, పవన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణ వ్యయాన్ని శనివారం ఎంపీవో గోవర్ధన్ లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలోని 11 మంది లబ్ధిదారులకు రూ. 4,808ల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. పంచాయతీ క్యార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల సత్వర పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జి దేవేంద్రబాబు, పక్కన ఏపీపీ అరుణ

భైంసాటౌన్: రాజీతోనే కేసుల సత్వర పరిష్కారం సాధ్యమని భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేసులను జడ్జి పరిష్కరించారు. అలాగే బ్యాంకు రుణాల రికవరీ కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ అరుణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.